నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
13 | హైదరాబాద్,శుక్రవారం 23 ఫిబ్రవరి 2024 | RANGAREDDY

## దామగుండం అడవిలో చెలరేగుతున్న మంటలు



మండలంలోని దామగుండం రామలింగేశ్వరాలయ ప్రాంతంలోని అడవిలో గత ఐదురోజులుగా మంటలు చెలరేగుతున్నాయి. అటవీలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో భారీగా మంటలు చెలరేగుతూ.. పొగ వ్యాపిస్తున్నది. దీంతో ఆ ప్రాంతంలోని జంతువులు, పక్షులు మృతి చెందడంతోపాటు పెద్ద, పెద్ద వృక్షాలు కాలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయుర్వేద వనమూలికలు నాశనమవుతున్నాయని వాపోతున్నారు. నేవీ రాడార్ కేంద్ర ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించడంతో గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే ఈ అటవీలో నిప్పుపెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–పూడూరు, ఫిబ్రవరి 22

## మహిళా సాధికారతతోనే బలమైన ఆర్థిక వ్యవస్థ




సిటీబ్యూరో, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : మహిళా సాధికారతతోనే బలమైన ఆర్థిక వ్యవస్థ సాధ్యమని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. గురువారం యూఎస్ కాన్సులేట్, వీకనెక్ట్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై జరిగిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. మహిళా ఆంత్రప్రెన్యూర్లు, వ్యాపారవేత్తలతోపాటు వీకనెక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, వీకనెక్ట్ ఇంటర్నేషనల్ సీఈవో వాజిక్వీజ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ శాఖకు కాసుల పంట

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.3,598 కోట్ల రాబడి**



- మరో రూ.100 కోట్ల ఆదాయం వచ్చే అవకాశముందని అంచనా
- ఇప్పటివరకు 2,04,333 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి
- గతేడాది వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లతో రూ.3,861 కోట్ల రాబడి
- గత ఆర్థిక సంవత్సరంలో 2,47,704 డాక్యుమెంట్లు..
- రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారానే వచ్చిన ఆదాయం రూ.1007 కోట్లు

వికారాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖకు ఈ ఆర్థిక సంవత్సరం కాసుల పంట పండింది. ఈ ఏడాది జిల్లాలో వ్యవసాయేతర భూముల క్రయవిక్రయాలతో ఇప్పటివరకు రూ.3,598 కోట్ల ఆదాయం ఖజానాకు చేరింది. అందులో రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారానే అధిక ఆదాయం సమకూరింది. అయితే ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో నెల రోజుల గడువున్న దృష్ట్యా వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లతో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కొంతమేర రెవెన్యూ తగ్గే అవకాశాలు ఉన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరం చివర్లో రిజిస్ట్రేషన్లు పుంజుకునే అవకాశాలున్నా ఈ నెలాఖరులో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌తోపాటు ఎన్నికల కోడ్ అమల్లోకి రానుండడంతో రిజిస్ట్రేషన్లపై ప్రభావం పడే అవకాశాలున్నాయని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన అధికారులు భావిస్తున్నారు. అయితే ప్రతి ఆర్థిక సంవత్సరం మార్చి నెలలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా వ్యవసాయేతర భూముల క్రయవిక్రయాలతో రూ.300 కోట్ల వరకు రెవెన్యూ వస్తున్నప్పటికీ ఈ ఏడాది మాత్రం మరో రూ.100 కోట్ల వరకు వచ్చే అవకాశమున్నది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేగంగా పారిశ్రామికాభివృద్ధి జరుగడం, రీజినల్ రింగ్‌రోడ్డు, అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రోడ్డుగా బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ, మోమిన్‌పేటలో 1200 ఎకరాల్లో మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో భారీగా లేఅవుట్లను ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా హైదరాబాద్‌వాసులు చాలావరకు శంకర్‌పల్లి, మొయినాబాద్, వికారాబాద్ వరకు తమ నివాసాలనను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతుండడంతో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల క్రయవిక్రయాలు భారీగా పెరిగాయి.

### రూ.3,598 కోట్ల ఆదాయం..

వ్యవసాయేతర భూముల క్రయవిక్రయాల ద్వారా ఉమ్మడి జిల్లాల స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.3,598 కోట్ల రెవెన్యూ వచ్చింది. అత్యధికంగా రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారానే రూ.1007 కోట్ల రాబడి చేకూరింది. అదేవిధంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అత్యధికంగా ఆదాయం గండిపేట, శేరిలింగంపల్లి, మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ప్రభుత్వ ఖజానాకు చేరింది. కాగా గతేడాది వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లతో రూ.3,861 కోట్ల ఆదాయం సమకూరగా.. 2,47,704 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.

### 2,04,333 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 2,04,333 డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. కొడంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 1,140 డాక్యుమెంట్లు, షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 7,107, ఫారూఖ్‌నగర్‌లో 14,053, చేవెళ్లలో 7,811, హయత్‌నగర్‌లో 6,143, ఇబ్రహీంపట్నంలో 14,216, పరిగిలో 2,157, తాండూరులో 3,284, వికారాబాద్‌లో 5,720, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో 19,354, సరూర్‌నగర్‌లో 6,858, చంపాపేటలో 12,606, పెద్ద అంబర్‌పేటలో 8,306, రాజేంద్రనగర్‌లో 11,138, మహేశ్వరంలో 17,816, శంషాబాద్‌లో 8,368, శేరిలింగంపల్లిలో 10,550, శంకర్‌పల్లిలో 4,821, గండిపేటలో 13,720, వనస్థలిపురంలో 12,200, ఎల్‌బీనగర్‌లో 10,460, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 6487 డాక్యుమెంట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు అయ్యాయి.

**ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఖజానాకు చేరిన ఆదాయాన్ని పరిశీలిస్తే..**

| సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం | వచ్చిన ఆదాయం |
|---|---|
| చేవెళ్ల | రూ.87.30 కోట్లు |
| రాజేంద్రనగర్ | రూ.289.69 కోట్లు |
| శంషాబాద్ | రూ.66.40 కోట్లు |
| శేరిలింగంపల్లి | రూ.355.18 కోట్లు |
| శంకర్‌పల్లి | రూ.88.82 కోట్లు |
| గండిపేట | రూ.656.10 కోట్లు |
| ఎల్‌బీనగర్ | రూ.125 కోట్లు |
| అబ్దుల్లాపూర్‌మెట్ | రూ.30.72 కోట్లు |
| వనస్థలిపురం | రూ.117.79 కోట్లు |
| చంపాపేట | రూ.119.74 కోట్లు |
| ఇబ్రహీంపట్నం | రూ.85.14 కోట్లు |
| షాద్‌నగర్ | రూ.49.20 కోట్లు |
| సరూర్‌నగర్ | రూ.104.84 కోట్లు |
| ఫరూఖ్‌నగర్ | రూ.72.61 కోట్లు |
| మహేశ్వరం | రూ.170.97 కోట్లు |
| పెద్ద అంబర్‌పేట | రూ.71.68 కోట్లు |
| హయత్‌నగర్ | రూ.54.57 కోట్లు |
| కొడంగల్ | రూ.1.65 కోట్లు |
| పరిగి | రూ.7.16 కోట్లు |
| తాండూరు | రూ.8.82 కోట్లు |
| వికారాబాద్ | రూ.27.40 కోట్లు |
| రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం | రూ.1007.88 కోట్లు |



కొత్తపేటలోని జడ్పీహెచ్ఎస్



### వచ్చే విద్యాసంవత్సరం నుంచే తరగతులు..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో సర్వే నిర్వహించి పాఠశాలలు ఏర్పాటు చేయాల్సిన పంచాయతీలను గుర్తించాం. 11 పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను ఇప్పటికే పంపించాం. వచ్చే విద్యా సంవత్సరంలో కొత్త పాఠశాలలను ప్రారంభించి తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

-సుశీందర్ రావు, రంగారెడ్డి డీఈవో

# మరిన్ని కొత్త బడులు

**వచ్చే విద్యాసంవత్సరం నుంచి రంగారెడ్డి జిల్లాలో మరో 11 పాఠశాలలు అందుబాటులోకి..**

- పంచాయతీకో స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయం
- క్షేత్రస్థాయిలో సర్వే చేసి ప్రతిపాదనలు రూపొందించిన అధికారులు
- జిల్లాలో మూతబడ్డ 88 బడులనూ పునః ప్రారంభించాలని కోరుతున్న ప్రజలు

రంగారెడ్డి, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ప్రతి పంచాయతీకీ ఒక పాఠశాల ఉండాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు సన్నాహాలు మొదలు పెట్టారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి వివరాలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా 11 పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్త పాఠశాలలు అందుబాటులోకి వస్తాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. వివిధ కారణాలతో జిల్లాలో ఇప్పటివరకు మూతబడి ఉన్న 88 పాఠశాలలను కూడా పునః ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌ను స్థానికులు తెరపైకి తీసుకొస్తున్నారు.

### పంచాయతీకో బడి..

రంగారెడ్డి జిల్లాలో మొత్తం 1,309 పాఠశాలలున్నాయి. వీటిలో ప్రైమరీ పాఠశాలలు 880, యూపీఎస్‌లు 180, జడ్పీహెచ్ఎస్‌లు 249 ఉన్నాయి. జిల్లాలో కొత్త పంచాయతీలు ఏర్పాటు అయినప్పటికీ చాలా చోట్ల పాఠశాలల్లేవు. పంచాయతీకో బడి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సంకల్పిస్తున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు సర్వే నిర్వహించి 11 బడులను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పిగ్లీపూర్, చేవెళ్ల మండలంలోని నాంచేరు, మాడ్గుల మండలంలోని జర్పులతండా, పలుగుతండా, జయరాంతండా, మహేశ్వరం మండలంలోని దిలావర్‌గూడ, నందిగామ మండలంలోని కన్హా, షాబాద్ మండలంలోని నారెడ్లగూడ, గొల్లూరిగూడ, తలకొండపల్లి మండలంలోని గడ్డమీది తండాల్లో కొత్తగా పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు.

### మూతబడిన వాటినీ పునఃప్రారంభించాలి

'డిపెప్' విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రతి కిలోమీటరుకూ ఒక పాఠశాల ఉండాలనే నిబంధనతో జిల్లాలో గతంలో భారీ స్థాయిలో కొత్త పాఠశాలలను ఏర్పాటు చేశారు. అయితే వివిధ కారణాలతో విద్యార్థుల సంఖ్య తగ్గి జిల్లాలో 88 పాఠశాలలు మూతబడ్డాయి. మూతబడిన వాటిలో 84 ప్రైమరీ, ఒక హైస్కూల్, మూడు యూపీఎస్‌లున్నాయి. పాఠశాలల మూతతో విద్యార్థులు దూర ప్రాంతానికి వెళ్లి చదువుకోవాల్సి వస్తున్నది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాఠశాలలను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మూత బడిన పాఠశాలలను సైతం పునః ప్రారంభించాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


## టెన్త్, ఇంటర్ పరీక్షలకు సజావుగా నిర్వహించాలి

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 22 : టెన్త్, ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. పదోతరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఉదయం 9:30 నుంచి జరుగుతాయని.. ఇందుకోసం జిల్లాలో 310 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 13,412 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు అందులో బాలురు 6883 మంది, 6477 మంది బాలికలు ఉన్నారన్నారు. అదేవిధంగా ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు 29పరీక్షా కేంద్రాల్లో జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 16,823మంది హాజరు కానున్నారని.. మొదటి ఏడాదిలో 7,799 విద్యార్థులుండగా ఇందులో జనరల్ 6,447 మంది, వృత్తి విద్యలో 1352 మంది పరీక్షలు రాయనున్నారని.. ఇంటర్ రెండో ఏడాదిలో 9024 మంది విద్యార్థులుండగా 7,689 మంది జనరల్ కాగా 1,335మంది వృత్తి విద్య కోర్సుకు సంబంధించిన విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు పది పోలీస్‌స్టేషన్లను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతిలేదని.. కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీ సు అధికారులకు సూచించారు. పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకొని బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసేందుకు ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్లు చెప్పారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఆర్డీవో విజయకుమారి, జిల్లా ఇంటర్ అధికారి శంకర్‌నాయక్, డీఈవో రేణుకాదేవి, డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ జయరాజు, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌చార్జ్ మనోహర్‌దాస్, డీటీవో జస్వంత్‌కుమార్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



అవిశ్వాస తీర్మానానికి హాజరైన డైరెక్టర్లు, మద్దతుదారులు

- డీసీవో ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం
- హాజరైన 11 మంది డైరెక్టర్లు
- ఫొటోలు, వీడియోలు తీసి సీల్డ్ కవర్‌లో న్యాయస్థానానికి అందజేత
- మార్చి 7న తుది తీర్పు
- అప్పటివరకు సుదర్శన్‌రెడ్డి చైర్మన్‌గా కొనసాగింపు
- ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన డైరెక్టర్లు

# బలపరీక్ష ఫలితం భద్రం

**హైకోర్టుకు చేరిన ఉప్పరిగూడ అవిశ్వాసం**

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 22 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్, వైస్‌చైర్మన్లపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన వ్యవహారం హైకోర్టుకు చేరింది. అవిశ్వాస తీర్మానానికి ఒక్కరోజు ముందు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం అవిశ్వాస తీర్మానంపై బలపరీక్ష నిర్వహించినా ఫలితాన్ని వెల్లడించొద్దని.. సమావేశంలో జరిగిన తీర్మానాలను సీల్డ్‌కవర్ ద్వారా సమర్పించాలని డీసీవోను ఆదేశించింది. కాగా హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం ఉదయం 11గంటలకు ఉప్పరిగూడ సహకార సంఘం కార్యాలయంలో డీసీవో ధాత్రీదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం పెట్టిన 11 మంది డైరెక్టర్లు హాజరై అవిశ్వాసానికే ఓటేసినట్లు తెలిసింది. ముందుగా డైరెక్టర్లు మినిట్ బుక్‌లో సంతకాలు చేశారు. సంతకాలు చేసిన మినిట్ బుక్, డైరెక్టర్ల సంతకాలతోపాటు ఫొటోలు, వీడియోలను సీల్డ్‌కవర్‌లో పొందుపర్చి డీసీవో హైకోర్టుకు అప్పగించారు. మార్చి 7న దీనిపై తుది నిర్ణయం వెలువడనున్నది. అంతకు ముందు కాంగ్రెస్ నాయకుడు పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో 11 మంది డైరెక్టర్లు క్యాంపు నుంచి నేరుగా సహకారసంఘం కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే చైర్మన్ సుదర్శన్‌రెడ్డి కూడా బ్యాంకులోనే ఉన్నా సమావేశానికి హాజరు కాలేదని తెలిసింది.

### మార్చి 7న తేలనున్న ఫలితం..

ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్, వైస్‌చైర్మన్లపై డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మార్చి 7న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వనున్నది. అవిశ్వాసానికి సంబంధించి చైర్మన్, వైస్ చైర్మన్ హైకోర్టును ఆశ్రయించగా బుధవారం స్టే ఇచ్చింది. బలపరీక్షను యథావిధిగా నిర్వహించాలని ఫలితాన్ని మాత్రం వెల్లడించొద్దని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో సహకార సంఘం అధికారులు గురువారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి డైరెక్టర్లు చేసిన తీర్మానాన్ని గోప్యంగా ఉంచారు. అవిశ్వాసంపై చేసిన తీర్మానాల ఫొటోలు, వీడియోలను సీల్డ్‌కవర్ ద్వారా న్యాయస్థానానికి సమర్పించారు. మార్చి 7న హైకోర్టులో కేసు ఉన్నందున చైర్మన్, వైస్‌చైర్మన్లపై అవిశ్వాసానికి సంబంధించి తుది ఫలితం వెలువడనున్నది. అప్పటివరకు సుదర్శన్ రెడ్డే చైర్మన్‌గా కొనసాగేలా కోర్టు ఆదేశాలిచ్చింది.

### సహకార సంఘం వద్ద భారీ బందోబస్తు..

ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్, వైస్‌చైర్మన్లపై డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస బలపరీక్ష సందర్భంగా గురువారం ఉప్పరిగూడ సహకార బ్యాంకు వద్ద పోలీసులు గట్టిబందోబస్తును ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ పీవీ రాజు, సీఐ సైదిరెడ్డి ఆధ్వర్యంలో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

## వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండొద్దు

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖల అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య నెలకొనే ప్రాంతాలను గుర్తించి పరిష్కారానికి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని.. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలన్నారు. మిషన్ భగీరథ నీటి ట్యాంకులు, పైపులైన్లలో లీకేజీలుంటే గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రస్తుతం పనిచేయని బోర్లు, పంపుసెట్లు, చెరువులు వంటి వాటిని ముందస్తుగా గుర్తించి వాటికి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వచ్చే మూడు నెలలు అత్యంత కీలకమని.. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏఈలు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో .. డీఈలు సంబంధిత మండలాల్లో ఉండాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు పని చేసే ప్రాంతాల్లో నీరు, మెడికల్ కిట్ వంటివి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డీఆర్డీఏ పీడీని ఆదేశించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ శ్రీలత, అదనపు పీడీ సుభాషిణి, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఇరిగేషన్ అధికారులు, ఎంపీడీవోలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.